క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున పట్టణ ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని తిరుమలగిరి మున్సిపాలిటీ కమిషనర్ దండు శ్రీనివాస్ శుక్రవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇళ్లల్లోని నీటి తొట్లు, పాత టైర్లు మొదలైన వాటిలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షానికి విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దని సూచించారు. ప్రజలందరూ వర్షం వచ్చే సమయంలో ఇళ్లలోనే ఉండాలని, అవసరం ఉంటేనే బయటకు వెళ్లాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి గుంతల పట్ల చిన్న పిల్లలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లు, పాత గోడలు ఏమైనా ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 9963736687కు ఫోన్ చేయాలని కోరారు.

కనీస జాగ్రత్తలు తీసుకోవాలి

నూతనకల్ : వానాకాలం నేపథ్యంలో ప్రజలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ నరేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షం కురిసే సమయంలో రైతులు, రైతు కూలీలు, పశువుల కాపరులు విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడి ఉండరాదన్నారు. వర్షంతో నిండిన కుంటల దగ్గర, లోతట్టు వాగుల నుంచి దాటకూడదని ఆయన సూచించారు. సమావేశంలో అరవింద్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా మొక్కలు నాటడం పూర్తి చేయాలి

సూర్యాపేట రూరల్ : 9వ విడత హరితహారంలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఈ నెలాఖరులోగా మొక్కలు నాటడం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హరితహారం, వర్షాభావ పరిస్థితులపై టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు గుర్తించి, ఎస్టిమేషన్ వేయించి కూలీలతో గుంతలు తీయించి నెలాఖరులోగా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. అదే విధంగా 4రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలన్నారు. చెరువులు, కుంటలు తెగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గకార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమ్మాలలో పీర్ల ఉత్సవాలు ప్రారంభం



పీరును ఊరేగిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో పీర్ల పండుగ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రడహుస్సేన్ పీరును గ్రామంలో ఊరేగించారు. ఇంటింటికీ నీళ్లారబోసి దట్టీలు కట్టారు. కార్యక్రమంలో ముజావరి పాష, నిర్వాహకులు భూపతి లక్ష్మణ్, కృష్ణ, ఉపేందర్, రంజిత్, అంజయ్య, లక్ష్మీనారాయణ, లింగస్వామి, రామనర్సయ్య, నవీన్, యల్లయ్య, వెంకటయ్య, సురేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని బద్యాతండాలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బానోతు చందు తన పశువులను మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు తోలుకెళ్లాడు. గాలి వానకు తెగి పడిన విద్యుత్ వైరు తగిలి పాడి గేదే మృతిచెందింది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలని ఆందోళన



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : పాఠశాలలోనే పుస్తకాలు విక్రయిస్తూ విద్యా దోపిడీకి పాల్పడుతున్న జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దనియాకుల శ్రీకాంత్‌వర్మ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయాన్ని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చెప్పినా ఇంత వరకు డీఈఓ, ఏడీ కుమ్మక్కై పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పిడమర్తి భరత్, ప్రవీణ్, మహేష్, మురళి, వినోద్, సుమన్, నాని, మహేష్, వినయ్, ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు..

- ఇంకుడు గుంతల నిర్మాణం
- గ్రామానికి ఐదు చొప్పున..
- స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్‌లో మంజూరు
- ఇప్పటికే పలు గ్రామాల్లో 14 వరకు నిర్మించినట్లు అధికారుల వెల్లడి



అనంతారంలో నిర్మించిన ఇంకుడుగుంత

పెన్‌పహాడ్ : వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టి సారించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా డ్రెయినేజీలకు ఇరువైపులా ఇంకుడు గుంతలతో పాటు కమ్యూనిటీ ఇంకుడు గుంతలను గ్రామాల వారీగా మంజూరు చేసింది. ఒక్కో గ్రామానికి ఐదు చొప్పున కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. గతంలో ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించగా ప్రస్తుతం డ్రెయినేజీలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్మిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేశారు.

ఉపాధి హామీ పథకంలో..

గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో మురుగు నీరు నిలువకుండా ఉండేందుకు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో డ్రెయినేజీ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, డ్రెయినేజీ ఇంకుడు గుంతలు 143 యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో స్థలాలు గుర్తించి ఎస్టిమెంట్ రూపొందించారు. కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.13272వేలు చెల్లిస్తారు. ఇప్పటి వరకు అనంతారంలో 5 ఇంకుడు గుంతలు, లింగాలలో 3, చెట్లముకుందాపురంలో 2, మాచారంలో 4 ఇంకుడు గుంతలు నిర్మించగా మిగతావి త్వరలో ప్రారంభించనున్నట్లు ఏపీఓ రవి తెలిపారు.

భూగర్భ జలాలు పెరుగుతాయి



ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. డ్రెయినేజీ, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణంతో ఎన్నో లాభాలు ఉన్నాయి. ప్రస్తుతం కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేశాం. త్వరలో డ్రెయినేజీ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, అనంతారం

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం



గ్రామాల్లో డ్రెయినేజీ, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు మొత్తం డ్రెయినేజీ, కమ్యూనిటీ గుంతల నిర్మాణం పూర్తికాగా మిగతావి ప్రగతిలో ఉన్నాయి. త్వరలోనే మంజూరైన ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేస్తాం. ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాం.

– రవి, ఏపీఓ

● 'గంగదేవమ్మ' గలగలలు..



అర్వపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామ గంగదేవమ్మ చెరువు శుక్రవారం నిండి అలు గుపోస్తోంది. ఈ చెరువు కింద వంద ఎకరాల ఆయకట్టు ఉంటుందని, ఈ వర్షాకాలం పంటలకు ఎలాంటి ఢోకాలేదని ఉపసర్పంచ్ కుంట్ల రేణుకగోవర్ధన్‌రెడ్డి తెలిపారు. చెరువు నిండటంతో రైతు లు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

28న స్పాట్ అడ్మిషన్లు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన డిప్లొమా ప్రథమ సంవత్సరం సివిల్ మెకానికల్ ఖాళీ సీట్ల ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 25 నుంచి 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, పాలిసెట్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉందని తెలిపారు. వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



రామన్నగూడెం పాఠశాలలో నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అర్వపల్లి: మనఊరు–మనబడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం పాఠశాలలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన గదులు, సంపు ఇతర నిర్మాణాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మన ఊరు– మనబడితో ఈ పాఠశాలలో పూర్తిగా సమస్యలు తీరాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలు నాయక్, సర్పంచ్ రమావత్ పీరమ్మ, కోఆప్షన్ సభ్యుడు హమీద్, ఎంపీఓ సందీప్‌కుమార్, హెచ్‌ఎం చిప్పలపెల్లి ధర్మయ్య, పీఆర్ ఏఈఈ అశోక్, కార్యదర్శి ఉపేందర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ సైదులు, మార్కెట్ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, పొట్టిపాక సైదులు, లక్ష్మీకాంతరెడ్డి, కర్నాటి మురళి, రమావత్ బీముడు, కంచర్ల పాండు, తనీష్, దోరెపల్లి వెంకటయ్య, మేడిపల్లి వేణు, మహేష్, సురేష్, స్రవంతి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



నాగారంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేంద్రకుమార్

నాగారం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, సమగ్ర ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని సూర్యాపేట ఆర్డీఓ రాజేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఓటరు జాబితాను సవరించాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరించాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎలక్షన్ డీటీ శ్రీకాంత్, నాగారం డీటీ షాహిన్‌బేం పాల్గొన్నారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకం

మద్దిరాల : ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన అవగహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. కార్యక్రమంలో నూతనకల్లు డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్,ఆర్ఐ వహీద్,సీనియర్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మామిడిపల్లి గ్రామస్తులు

నాగారం : అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మామిడిపల్లి గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ మాట్లాడుతూ మామిడిపల్లిల్లో 23ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సర్వేనెం.9లో 6 ఎకరాల ఇండ్ల స్థలాన్ని కొనుగోలు చేసి నేటికీ ఇవ్వలేదన్నారు. గ్రామంలో ఇండ్లు లేని నిపేరుపేదలు ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, అధికారులు భూమిని సర్వే చేసి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కండె భిక్షం, గూడపూడి వెంకటేశ్వర్లు, పడిశాల మంజుల, సువర్ణ, ప్రమీల, యాదమ్మ, సోమలక్ష్మి, లింగమ్మ, ఉప్పలమ్మ, ఒక్కమ్మ, లక్ష్మి, రామతార, మల్లమ్మ సోమక్క తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మణిపూర్‌లో అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మూడు నెలలుగా మణిపూర్‌లో మారణ హోమం జరుగుతున్నదని, 2002 గుజరాత్ మారణ హో మాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఇండ్లపై దాడులు, కూల్చివేయడం, హత్యలు, సామూహిక అత్యాచారాలు, ప్రార్థనాలయాల కూల్చివేత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మాట్లాడకుండా చోద్యం చూస్తున్నదని ఆయన మండిపడ్డారు.

హింసకాండకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మణిపూర్‌లో హింసకాండకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పాలకులను డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి లైంగిక దాడి జరిపి, వారిని నగ్నంగా ఊరేగించి హత్య చేసిన ఇద్దరిపై వెంటనే కేసు నమోదు చేసి, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని కోరారు.

అపరిశుభ్రంగా వ్యవసాయ మార్కెట్ యార్డు



వ్యవసాయ మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు అపరిశుభ్రంగా మారింది. మార్కెట్ యార్డులో చెత్తా, చెదారంతో దుర్గంధం వెదజల్లుతుంది. మార్కెట్ యార్డులో ఫ్లెక్సీలు, ఇతర వస్తువులు పడి అధ్వానంగా మారింది. మార్కెట్ యార్డులో అపరిచిత వ్యక్తులు మద్యం సేవిస్తూ బీరు బాటిళ్లు తాగి అక్కడే పడవేస్తున్నారు. మరి కొందరు తాగిన బాటిళ్లను పగలగొట్టి వెళుతున్నారు. పగిలిన సీసాలతో రైతులు, మార్కెట్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో పగిలిన సీసా ముక్కలు వాహనాల టైర్లకు గుచ్చుకొని పంక్చర్లు అవుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ మార్కెట్ అధికారులు పట్టించుకొని పరిశుభ్రంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

● ఎరక్కపోయి ఇరుక్కుని..!



సూర్యాపేట పట్టణంలో ఓ వీధి శునకం ప్లాస్టిక్ డబ్బాలో తల పెట్టి అవస్థపడింది. ఆ డబ్బా బిగ్గరగా ఉండడంతో తల అందులో ఇరుక్కుపోయింది. అలా డబ్బాతోనే వీధుల్లో సంచరిస్తుండగా చూసిన వారందరూ ఎరక్కపోయి.. ఇరుక్కుంది అంటూ చెప్పుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



తిరుమలగిరిలో దీక్ష చేస్తున్న కార్మికులు



అర్వపల్లిలో ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

చివ్వెంల(సూర్యాపేట) : తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో గసాగర్, బానోతు కృష్ణ, నవీలే ఈదయ్య, గోగుల గోపాల్, కలకొండ ఈదయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ఒంటి కాలుపై నిల్చొని పంచాయతీ కార్మికుల నిరసన

అర్వపల్లి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం 16వ రోజు అర్వపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒంటి కాలుపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెన్‌పహాడ్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయం ముందు కార్మికులు భజనలు, ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రణపంగ వెంకన్న, నకిరేకంటి నర్సయ్య, ఏడు కొండలు, రవి, సైదులు, నరేష్, ఎల్లమ్మ, రమణయ్య, ముత్తమ్మ, నాగరాజు, వెంకన్న, శివ, చినపంగి శ్రీను పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు స్థానిక తెలంగాణ చౌరస్తాలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో దూపటి బక్కయ్య, నాగయ్య, శోభ, ప్రభ, రాజు, యాకయ్య, వెంకన్న, అనిల్ పాల్గొన్నారు.

నూతనకల్‌లో..

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్‌కార్యాలయం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం కార్మికులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల ప్రత్యేక అధికారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్)లో..

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండారు సైదులు, పి ప్రసాద్, తన్నీరు వెంకన్న, మల్లేష్, శ్రీను, ఫక్రుద్దీన్, పీటర్, షఫీ, అంజయ్య, నాగయ్య, బుచ్చమ్మ, సంధ్య, యాదమ్మ, వెంకటమ్మ, సంతోష, వీరయ్య, వెంకటయ్య, మల్సూర్, పవన్, నాగమ్మ పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



లింగాలలో మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మామిడి వెంకన్న

పెన్‌పహాడ్ : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని సర్పంచ్ మామిడి వెంకన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఏనెకుంటతండాలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

తుంగతుర్తి : సీజనల్‌వ్యాధులు ప్రభలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏనెకుంటతండాలో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతిక సారథి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిరా, ప్రియదర్శిని పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నూతనకల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఆశ్రితారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్, వాడిన ఇంజన్ ఆయిల్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు తారమ్మ, మాణిక్యమ్మ, దేవిరెడ్డి వెంకటరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



వేల్పుచెర్ల స్టేజి వద్ద కళాకారుల ప్రదర్శన

అర్వపల్లి: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం వేల్పుచెర్లస్టేజి వద్ద ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ఆటపాటల ద్వారా వర్షంలోనే ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేష్, కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నూతనకల్ : తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత ఉన్న వారు పదో తరగతి, పది పాసైన వారు ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసే అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకురాలికి నివాళి

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఆటో యూనియన్ అధ్యక్షుడు రమావత్ అంజుల తల్లి, సీనియర్ నాయకురాలు రమావత్ వాలి శుక్రవారం మృతిచెందారు. మండల పరిషత్ అధ్యక్షురాలు మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సర్పంచ్ పీరమ్మ, బీముడు, భిక్షం, తనీష్, మేడిపల్లి వేణు, సురేష్, సైదులు, ఎల్లేష్ ఉన్నారు.

బీమాతో రైతుకు భరోసా

- రూ. 5లక్షలతో బాధిత కుటుంబాలకు ఊరట
- పథకంలో చేరే కొత్త వారినుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 5 వరకు గడువు



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

పెన్‌పహాడ్ : ఆపత్కాలంలో అన్నదాత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది.. రైతుబీమా పథకం. అనారోగ్య, ఇతర కారణాలతో మృతిచెందిన రైతుల కుటుంబాలకు రూ.5లక్షలు బీమా రూపంలో అందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుబీమా పథకంలో భాగంగా కొత్తపట్టా పాస్‌పుస్తకాలు వచ్చిన అర్హులైన రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ పథకంపై రైతులకు ఏఈఓలు అవగాహన కల్పిస్తున్నారు. ఆగస్టు 5 వరకు కొత్తగా అర్హులైన 1200 మంది రైతుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఎలా మృతిచెందినా...

ఈ పథకం ద్వారా రైతు ఏ కారణంగా మృతిచెందినా నామినికి బీమా నగదు అందజేస్తున్నారు. పథకంలో చేరిన రైతు ఎలా మృతిచెందినా నామినికి 15 రోజుల్లోగా రూ. 5లక్షలు ప్రమాద బీమా సొమ్ము అందించేలా ఈ పథకాన్ని రూపొందించారు.

బీమా చేయించుకోవాలి



పట్టాపాసు పుస్తకం ఉండి 18–59 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి రైతు బీమా చేయించుకోవాలి. పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌లను వ్యవసాయ అధికారులకు అందించాలి. రైతు బీమాపై గ్రామీణ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి.

– బి. కృష్ణ సందీప్, మండల వ్యవసాయ అధికారి